# నాగ

వ. పాపయ్య

★

సంజ నారింజవెలుగులో పసిడిముద్దలు; సంపెంగ పూలు, చెట్టునిండా, వాటికంటె తళుక్కుమనే ఓ చక్కనిపిల్ల పూలు సిగముడుస్తూ, కోయిలనుపిలుస్తూ, నెమలికి నాట్యంనేర్పుతూ పాటకాని పాటేదో పాడుకొంటున్నది తనలో తాను.

• • •

అదరిపడ్డది సడికి, పూవులు దోసినుండి జారిపడ్డవి. దరిలోని పెనుబాము చరచరా దరికివస్తోంది. చుట్టూపొదలూ, పుట్టలూ, తప్పించుకోలేక సంపెంగ లేమ్రానుకి జేరబడి కెవ్వుమన్నది. పాము బుస్సుమన్నది.

ఆ దారినేవస్తున్న ఓ వయసుగాడు, కేకవిని తోలిమొనలతో యెగిరి కొట్టుకుంటున్న రొమ్ము, పిరికిచేపలచూపుల మెరుపుగల చిన్నదాన్నీ పామునీ చూడ్డంగా, చంకనున్న నాగసరం పెదాలకు ఆనించి పాటతోకట్టుకట్టి పాముని చేతులతో నాగుమల్లె పూలదండమల్లే వుశిపుతూ,

'షిరికిదానా! పొద్దోయ్యేయేళని యీజాగాల్లో తచ్చాడొచ్చా-పదనిబ్బరంగా' అన్నాడు. పిల్లకళ్లలో నిబ్బరము మెరిసింది. చిరునవ్వు జల్లుతో కదలబోయింది.

'నివ్వెవరూ, యీ అడివిలో యేనాడూ సూడలేదు'

'నేను, నేనే, 'నాగ'—అదో, ఆ కొండలాగు జారేచోట—వెదురుపొదలుంటేచోట.'

'నాగ! పాముకి బెదుతుందా—నీ మొగం మరీమరీ చూడాలని, తేనె తాగినట్టు నీ గొంతుకినాలనివుంది—రేపవుపిస్తావూ?'

'ఈ సంపెంగలంటే నాకు మా మనసు-నివ్వొస్తావూ! మంచి తేనెతెస్తాలే' కదిలి, మెల్లమెల్లగా చెట్లలో మాయమైంది—చూసి--చూసి—చేతిలోని పాముని జబ్బపూరా దూరంగావిసరి, నేలనున్న సంపెంగలు యేరి గట్టిగా వాసనపీల్చి, యెఱ్ఱని పాగాలో కొన్ని దోపుకున్నాడు. నాగసరం వూదుకుంటూ బయద్దేరాడు—లేతచీకటిలో చిట్టడవిచెట్ల నీడల్లోంచి.

2

మర్నాడు నాగ తేనెనింపిన వెదురుగొట్టాముతో, గబగబా అడుగులేస్తూ వస్తూండగా, ఒక్కసారి కూలిపోయింది. కెంపురంగెండలో మిలమిల మెరుస్తూ నల్లనిపాము పొదల్లోకి ప్రాకిపోయింది.

పడమటి వెలుగుపడి దూరానికి పసిడినాగులా వున్న నాగనిచూసి పరుగెత్తుకొనివచ్చి, నురుగు, సొంగనోటిని జారే ముఖములో బ్రతుకు చిన్నెలుండటం గుర్తించాడు. తన దండనున్న మణితీసి పాదానికున్న గాయానికి గట్టిగా ఒత్తికట్టాడు. ఆకులూ పువ్వులూ తెచ్చి ఒత్తుగాకుప్పేసి నాగని పండుకోబెట్టి, మూలికలేవో అరగదీసి నోటిని, చెవుల్లోను,

• USE ALWAYS "BABY MEDAL" BRAND SOAPS. • 

ముక్కునా వేసి ఆసగా చూశాడు. తామరాకుతో నీళ్ళు తెచ్చి పూలుముంచి నాగ ఒంటిమీద జల్లుతూ నాగ తలనొడిమీద నుంచుకున్నాడు. ఆస పండింది. —మబ్బుల్లోంచి చందమామ తొంగిచూచింది. నాగ సగంకళ్ళు తెరిచిచూశింది. —మళ్ళా ఆయాసంతో మూసుకుంది.

చక్కటి నాగ నుదుటిని ముద్దెట్టుకోవాలని వంగుతున్నాడు— వెనుకనుండి.

'ఎవరక్కడ ?' అని ఒక బలమైనగొంతు వినిపించింది.

'ఎవరయితేం, యీడకేమొస్తావు ?'

'ఈ దార్లో ఓపిల్ల కానొచ్చిందా ?'

'ఆ !' గుర్తుగాచూసి, పోల్చి 'నీవట్రా తమ్మా!'

'అన్నోయ్-చీకటి, పోల్తినట్టయింది గాదు.- యేం జేస్తుండావు.'

'ఇదో చక్కని కన్నె పాముకాటుకి సొమ్మసిల్లింది.'

'ఎవరదీ ?' ఆత్రంగా, అన్నవొడిలో మెల్లిగా వూపిరితీస్తున్న నాగనిచూసి, 'ఇదే. నిన్ననోపాము నుండి తప్పించా, నాకోసమే వస్తోంది—యిదుగో, తేనె చిమ్ముతోంది'—ఆకుతో మూతి బిగించివున్న వెదురుగొట్టాన్నెత్తబోయాడు నేలనుండి తమ్ము.

అన్న—అక్కడుండనీ మందు !

తమ్ము—ఏం ?

అన్న—ఇది లేవనీ, తెలిస్తే, యెవరికిస్తూందో ?

తమ్ము—నాకే తెస్తూందిగా.

అన్న—నేను బ్రతికిస్తేనిగా, కానుక నాకో ?

తమ్ముడిగుండెల్లో త్రాచుటిక్కుపడి నులుచుకున్నట్టయింది.—

చీకట్లు దట్టంగా క్రమ్ముకొన్నవి.

౫

ఆ యిద్దరూ ఓ తల్లికొడుకులే, వాళ్ళను ఆ అడవిలోని వారందరూ 'అన్నా'—'తమ్మా' అనే పిలుస్తుంటారుగాని వేరుపేర్లేలేవు. ఆ పాములవాళ్ళ తెగలో అన్న, తమ్ములనిమించిన మంత్రగాడు, నాగసరం పాటగాడులేడు. అంచేతందరికీ వీళ్ళు చిన్నవాళ్ళే అవడంవల్ల మురిపెము.

ఇద్దరూ ఓరోజు దగ్గిరూళ్ళకివెళ్ళి యేదో సంపాదించి వొచ్చారంటె చాలు—వారంరోజుల వరకూ తల్లితోబాటు ముగ్గురూ హాయిగా పొట్ట నింపుకొని గడిపేసుకుంటూరు. అడివి బ్రతుకులోని అందమంతా అనుభవిస్తున్నారు. కాని—

ఇద్దరిమనస్సులూ నాగమీదవాలిన మొదలు వేరై పోయాయి. ఇద్దరిమధ్య విషపుమంట పెరుగుతోంది యిదిచూచి తల్లిగుండె రోజురోజుకి తరుక్కుపోతున్నది. ఎవడిమట్టుకు వాడూరికెళ్ళి గింజలు గట్రా తెస్తాడు. తల్లి ఒక్కమనసుతో వేరువేరుగా పెడుతుంది. అంతకుముందు ముగ్గురూ ఒక్కదాంట్లోనే కలిసితినేవారు.

నాగ మనసేమోకాని, యిద్దర్నీ ఓలాగే చూస్తుంది. ప్రతిపొద్దూ పలకరిస్తుంది. త్రాగండని తేనెతెస్తుంది. తేనెకంటె తియ్యగా మాట్లాడుతుంది. నవ్వుతుంది.

కాని అన్నకు తమ్ముకు మధ్య కనుపించని విషం నాగకోసం యేరై పారుతూన్నది.

తల్లి నాగను చూసినపుడల్లా కల అనుకొంటుంది.

## 4

ఓనాడిద్దరూ మత్తెక్కి మాటామాటా పెంచుకొని బాకులుతీసుకున్నారు. ఆ రెండుబాకులూ మెరుస్తూ, చూస్తున్న తల్లిగుండెను చీలుస్తున్నవి. ఆ అందగాళ్ళలో అంతకోపం యెలా దాగివుందోనని ఆ తెగవాళ్ళంతా నిచ్చరబోయారు. ఇద్దర్నీ బతిమాలారు. ఎన్నయినా చల్లబడలేదు.

నాగ ఓమాల బుగ్గమీద కన్నీటిబొట్లతో కొనవచ్చింది. దాంతో వూరుకున్నారిద్దరూ. అంతా వెళ్ళిపోయారు—నలుగురూ తప్ప, తల్లి బెక్కుతూ, లేని కోపంతో అంది.—

'రేపురాతిరికిద్దరూ యెలానో ఒకటైతే సరి, లేదా నాకళ్ళకి మీ బొందెలు చూపకండి.'

'అదెల్లామ్మా?' అన్నారిద్దరూ.

'ఇదుగో చెప్పతా,' అని నాగను దగ్గిరికి తీసుకుని 'దీన్ని కాపాడినందుకేగా మీరు క్రూరవీగి దెబ్బలాడుతూంట—నాకూ తెలుసు మంత్రాలు, మందులు—ఏదీ, పెద్దోడా, నీదగ్గరిమణి యిలాతే, మీ అయ్యది ఒక్కడి దగ్గిరెందుకు, వున్నా అది మీకెందుకు, 'అంటూ అన్నదగ్గిరున్న మణి తీసుకొని నాగని బుజ్జగిస్తూ' అమ్మీ యేదీ నీ చేయి, యిది నీ చేతికున్నంతవరకూ నిన్నేపామూ కరవదు. కాటిచ్చినా విసమేయెక్కదు' మణిని నాగ చేతికి కట్టింది. 'నీకోసం తగువులాడి నన్నేడిపిస్తున్నారీ పోగరుబోతులు, ఒక పందెం, గెలిచిన వారిదీ నాగమణి— రేపటిసంగతి చెపుతారండి.'

నలుగురూ గుడిశలోకిపోయారు. చీకటి ఒంటరిగా మిగిలింది.

అన్నా తమ్మూ మర్నాటి పందెం యేర్పాటు గురించి ఆరాత్రల్లా కలతగా నిద్రగడిపారు...

## 5

మింటిని పగటిరేడు పడమటికి నడుస్తున్నాడు.

సంపెంగచెట్టు పూలతో నిండివున్నది. చెట్టు నీడ అందంగావున్నది.

కొంచెం దూరంలో ఒకరికొకరెదురుగా అన్నా తమ్మూ కూర్చుని నాగసరంకొయలూదుతున్నారు. ఆ పాటలకి రెండుపాములు పడగలెత్తి నిల్చున్నాయి. ఒకపాము అన్నది, మరొకటి తమ్ముడిది. రెండూ జరిపోతు నాగులు.

వాటికెదురుగా, సంపెంగనీడలో ఒక ఆడు నాగు చుట్టిబెట్టుకుని కూచున్నది. మూడుపాములూ మంత్రాలకు పాటకు కట్టుబడినవే.

పాములు రెండూ ఆడపాముని కలిసేందుకు పరుగెత్తబోతున్నవి. కాని పోలేకపోతున్నవి. ఆగి ఒకదాన్నొకటి పొడుచుకొని పెనవేసుకొని పోరుతున్నవి. బుసలుకొడుతూ తోకలు నేలను కొడుతున్నవి.

ఎవరిపాము నాగుని చేరగలుస్తుందో వారిదీ నాగ, అదే పందెంగెలుపు. ఈలోగా పాటూ, మంత్రంతో ఒకరిపామునొకరు పోనీకుండా అరికడుతూ యెవరిపాముని వారు కట్టివిప్పకుంటూ నాగు మీదికి రేకెత్తించాలి. ఆ తెగవాళ్ళలో యిదొక పందెం. తల్లిదగ్గిర ఒప్పుకొని మరీ పూనుకున్నారు. తల్లియేర్పాటు, తల్లిమాటకి ఆ అడివివాళ్ళు పూజించారు. మాటకు కట్టుబడతారు.

సాయంత్రం కావస్తున్నది. పాటలు పోరాడుతున్నవి. ఇద్దరిబలమూ సమంగావుంది. అన్నకి తమ్ముకి పాములూ పాటతప్ప మరొకటి యేదీ కనుపించదు. వినిపించదు.

పూలకోసం నాగవచ్చింది, సంపెంగనీడ నిల్చోంది. ఇద్దర్నీ చూస్తున్నది. నవ్వుకొన్నది.

పాముల నాల్కలు నిప్పుతుంపరల్లా మండుతున్నవి. పోరుసాగుతున్నది. ఎడతెరిపిలేకుండా నాగ సరాలపాట వినిపిస్తోంది. మార్పుని కారుమేఘాలు గర్జిస్తున్నవి.

నాగ పూలు ముడుచుకొంది. పూదాలదగ్గిర నాగుపామునివంగి తలదువ్వుతూ పందేన్ని, యిద్దర్నీ చూచి రేమో అనుకుంది. తనలో నవ్వుకొని చేతినున్న మణినివిప్పి దూరంగా విశిరిపారేసింది. పాము తలమీద మెల్లగాదువ్వి గట్టిగా ఓసారి కొట్టింది. నాగ అరచేతినుండి రక్తపుచుక్కలు రెండుపడ్డవి, నాగ చెట్టుక్రింద సొమ్మసిల్లింది. అన్నా తమ్ము యింకా వూత్తూనేవున్నారు.

చీకటి అయింది. కారుమబ్బులల్లుకొంటున్నవి. చిన్ని మెరుపులు పాము నాలుకల్లా వెలువడుతున్నవి. పాములు సొమ్మసిల్లుతున్నవి, మళ్లా లేస్తున్నవి.

నాగ నాలుగురోజులనుంచి తియ్యని సంపెంగలన్నీ రాలి నాగను కప్పివేసినవి. నాగపైని యింకా పూలు పడుతూనేవున్నవి.

తల్లివచ్చింది.—పూలకుప్పలలోని నాగను చూచింది.—చేతికున్న మణిలేదు—కన్నీరు జారుతున్నది తల్లి మొగంనుండి. నాగ కళ్ళుమూసుకుని చిరునవ్వు పెదవులతోవుంది. తల్లికొడుకుల్ని చూచింది- పట్టుదలతోనే పూదుతున్నాదింకా—

తల్లి గొంతెత్తి అరిచింది 'చాల్సు, మీ పందెం, మిమ్మల్ని నాగ గెల్చేసింది.' నాగమీదపడి యేడుస్తూంది. 'తల్లీ, నివ్వేమిటో, యీ వనదేవతవు కావుగదా—ఈ యిద్దరితగవు నివ్వే తీర్చావేపిల్లా.,

అన్నా తమ్మూ వచ్చారు దగ్గిరికి. ఇంకేమున్నది. నాగనుచూసి నిట్టూర్చారంతే.

ఓసారిద్దరూ ఒకర్నొకరు అన్నతమ్ముల్లా చూసుకున్నారు.

ఆకసం చిట్లిపోతున్నది. పెనుగాలి లేగింది. మెరుపులు, వురుములు పోరుచేస్తున్నవి.—ఆ అడివంతా కటికచీకటిలో కూలిపోతున్నది. జోరుగా నీరు మీదినుండి జారుతున్నది.—గాలికి చెట్లు కూలిపోతున్నవి.

అన్నాతమ్ము తల్లిని యెత్తుకుని పెనుగాలితో పందెం వేసి, చీకటిలో మెరుపువెలుగులో దారిచూసుకుని అడుగులు గబగబవేస్తున్నారు. చెట్లువిరిగి పడిపోతున్నవి. తప్పించుకొని గుడిశెలకు దారిచూసుకుంటున్నారు. తల్లితో తప్పించుకొని వెళ్లిపోయారు.

సంపెంగచెట్టు వ్రేళ్ళతో పెకల్చి నాగమీద పడవేసింది పెనుగాలి. చెట్టుకొమ్మలు నాగకు పందిరి కట్టినవి. పూవులు శయ్యలుపరిచినవి.

అడవిగాలిలో నీటిలో వూగిపోతున్నది. నేల కరిగిపోతున్నది.—

## 6

కొన్నాళ్ళకాచోట చిన్న సంపెంగ మొక్క మొలిచింది.

అన్నతమ్ము మొక్కని పెంచారుట.

అది వ్రానుఅయింది.

ఆ అడవిలో ఆ పాములాళ్లు ఆ చెట్టుని ఆడివికి రాణి అనుకుంటారు. 'వనదేవతగా' పూజిస్తూంటారిప్పుడు.—అడివినమ్మకాలు.—!

ఆ చెట్టుపూవులని నాగ సంపెంగలంటారు.—నాగసంపెంగచెట్టంటారు, తుమ్మెదలా పూల జాడలకుపోవుట—

ఆ అడివి చూశారా? ఆపూలు కోస్తారా?